## క్లుప్తంగా

### పంటలో బూడిద తెగులు



పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

అట్లూరు: నువ్వుల పంటకు బూడిద తెగులు ఆశించదని బద్వేల్ వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చింతలచెరువు రైతు సేవా కేంద్రం పరిధిలోని పత్తిపంట, అట్లూరు మండలం తంభళ్లగొంది రైతు సేవా కేంద్రం పరిధిలో నువ్వుల పంటను ఆయన పరిశీలించారు. బూడిద తెగులు నివారణకు ఏ మందులు పిచికారీ చేయాలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ అంకయ్యకుమార్, ఏవో రామకృష్ణయ్య, చంద్రమోహన్‌రెడ్డి, పవన్‌కుమార్, సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

### ఏపీజీఈఏ డైరీ ఆవిష్కరణ

బద్వేలు అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నూతన డైరీని మంగళవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని ఏఎస్ డబ్ల్యూఓ కార్యాలయంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎం.రామయ్య విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలో ఉద్యోగులకు అవసరమైన జీవోలు, సెలవు దినాలు క్లుప్తంగా ఉన్నాయని, ఇది ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్సేనయ్య, లక్ష్మిదేవి, సుభాష్‌చంద్ర, శివశంకరయ్య, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

### లక్కీడిప్‌కు ఎంపిక

బద్వేలు అర్బన్: బద్వేలు–పోరుమామిళ్ల రూట్‌లో ఏర్పాటు చేసిన గిఫ్ట్‌స్కీంకు సంబంధించి లక్కీడిప్ విజేతలను డిపో మేనేజర్ ఆర్.సి.నిరంజన్ స్థానిక డిపోలో మంగళవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించేలా ప్రోత్సహించేందుకు గిఫ్ట్‌స్కీం తీసుకు వచ్చినట్లు తెలిపారు. లక్కీడ్రాలో ఐఎల్ఎన్.రాజు, రఘురామయ్య, డి.ప్రసన్న వరుస బహుమతులు గెలుచుకున్నారు. ఏడీసీ ఎస్.వి.సుబ్బయ్య, శ్రీనివాసులు, ప్రసాద్, సుందరయ్య, భాస్కర్, శివారెడ్డి పాల్గొన్నారు.

### రాయితీపై పరికరాలు

మైదుకూరు: రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలను అందించనున్నట్లు మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి తెలిపారు. గత ఐదేళ్లుగా రాయితీ పొందని ఎస్సీ, ఎస్టీ, మహిళలు, చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. ఈ పంట నమోదు చేసుకుని, పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన వాస్తవ సాగుదారులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఒక కుటుంబానికి ఒకే లబ్ధిదారుడు, ఒక లబ్ధిదారుడికి ఒక పరికరం మంజూరు చేస్తామని వివరించారు.

### సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న గోశెట్టి రామ్మోహన్

మైదుకూరు: ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్నా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడం లేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ్మోహన్ విమర్శించారు. మైదుకూరులో మంగళవారం జరిగిన ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు డీఏ, ఐఆర్, పీఆర్సీ, సీపీఎస్ రద్దు తదితర అంశాలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ బదిలీ నియంత్రణ చట్టం–2025పై చర్చించారు. ఈ కార్యక్రమంలో కూశెట్టి పాలకొండయ్య, యాపరాల వెంకటసుబ్బయ్య, బీకే సురేష్, రమణయ్య, చెన్నకేశవ ప్రసాద్, మునెయ్య పాల్గొన్నారు.

### ఫొటోగ్రాఫర్ కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

మైదుకూరు: తోటి ఫొటోగ్రాఫర్ మరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతడి కుటుంబానికి మైదుకూరు, ప్రొద్దుటూరు పట్టణాలకు చెందిన ఫొటో గ్రాఫర్లు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. మైదుకూరు మండలం ఎస్.ఎర్రబల్లెకు చెందిన ఫొటోగ్రాఫర్ చంటి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనారోగ్యంతో ఉన్న ఇద్దరు ఆడ పిల్లలతో చంటి కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఫొటోగ్రాఫర్స్ తమ అసోసియేషన్ నుంచి రూ.1,33,200 బాధిత కుటుంబానికి అందించారు.

### అప్రమత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల: మహిళలు, విద్యార్థినులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డేవిడ్‌రాజ్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ జాగ్రత్తగా ఉండకపోతే ప్రాణాలకే ముప్పు వస్తుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాల బాధితుల గురించి వివరించారు.



వెల్లాల వద్ద కుందూనదిలో నీరు



కుందూతీరంలో పచ్చగా వరిమళ్లు

## కుందూ తీరం.. పచ్చదనం

మండలంలోని వెలవలి–తొండలదిన్నె గ్రామాల మధ్య కుందూ తీరం చుట్టూ పచ్చదనం పరుచుకుంది. వేసవి ప్రారంభమైనా కుందూ నదిలో నీరు ఉండడంతో వరి పంట నూర్పిళ్ల అనంతరం తిరిగి రైతులు మళ్లీ అదే పంట సాగు చేశారు. ప్రస్తుతం ఆ దారిలో వెళ్తున్న వారందరూ ఎంతో చల్లగా ఉందని చెబుతున్నారు. ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – రాజుపాళెం

## ఉద్యోగులకిచ్చిన హామీలు ఏమయ్యాయి?



మాట్లాడుతున్న రమణారెడ్డి

పోరుమామిళ్ల: శ్రీన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, సీపీయస్ కమిటీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలవుతున్నా ఉద్యోగుల సమస్య ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. డీఏ బకాయిల చెల్లింపు, మధ్యంతర భృతి, పీఆర్సీ, సీపీఎస్ రద్దు సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. జీతాల నుండి మినహాయించుకున్న జెడ్పీ పీఎఫ్, ఏపీ జీఎల్ఐసీ లోన్లు, సంవత్సరాల తరబడి చెల్లించకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. వివాహాలు, వైద్య ఖర్చుల కోసం దాచుకున్న సొమ్ము చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే పీఆర్సీ కమీషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నాయకులు చంద్రహాసరెడ్డి, శేఖర్‌బాబు, పుల్లారెడ్డి, గురయ్య, శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## కొండ్రాజుపల్లె చెరువును ఆక్రమిస్తే చర్యలు

**ఆర్డీఓ చంద్రమోహన్**



పంటను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

కాశినాయన: మండలంలోని కొండ్రాజుపల్లె చెరువు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ అన్నారు. మండలంలోని కొండ్రాజుపల్లె చెరువును మంగళవారం ఆయన పరిశీలించారు. కొండ్రాజుపల్లె చెరువు సావిశెట్టిపల్లె రెవెన్యూ పొలం కింద 64 ఎకరాలు, కత్తెరగండ్ల రెవెన్యూ పొలం కింద 51 ఎకరాలు కలిపి అప్పట్లో నిర్మించారని తెలిపారు. కొంతమంది చెరువు ఆక్రమించి పొలాలు తయారు చేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దాదాపు 43 ఎకరాలు ఆక్రమణకు గురైందని, 15 ఎకరాలను ఆక్రమించి కొందరు రైతులు అరటి, కూరగాయల పంటలు సాగు చేశారని తెలిపారు. డ్రోన్ ద్వారా మొత్తం చెరువు విస్తీర్ణాన్ని కొలిపించామని, చెరువులో భూములు సాగు చేస్తున్న రైతుల పేర్లను తమకు అందజేయాలని తహసీల్దారును ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు సర్వే నెంబర్లతో సహా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. చెరువు విస్తీర్ణం వరకు కాలువ తీయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నరసింహులు, ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, డీఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ కొండారెడ్డి, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, స్థానిక వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

**డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు**



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

ప్రొద్దుటూరు క్రైం: ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆశా వర్కర్లతో జరిగిన సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులందరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. ప్రొద్దుటూరు అర్బన్ నుంచి ఇప్పటి వరకూ ఒక్క క్యాన్సర్ కేసు రెఫర్ కాలేదని తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించడంలో నిర్లక్ష్యం పనికి రాదని, కొన్ని సచివాలయాల పరిధిలో తక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. త్వరలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో బాల భవిత కేంద్రం ఉన్నట్లు చాలా మందికి తెలియదని, పుట్టిన పిల్లల మొదలు 18 ఏళ్ల వారికి అక్కడ అధునాతన వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు.చాలా మందికి ఈ విషయం తెలియక బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు వెళ్తున్నారని, తెలిపారు. గర్భస్రావాలపై ప్రత్యేక దృష్టి సారించాలలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ పద్మిని, ఖాజామొహిద్దీన్, రాజారత్నం, రాఘవపాల్గొన్నారు.

## శంఖవరం కాంప్లెక్స్‌ను మార్చడం తగదు



నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

కలసపాడు: మండలంలోని శంఖవరం కాంప్లెక్స్‌ను మార్చడం తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.బాలజోజి, భూతపాటిప్రభాకర్ అన్నారు. శంఖవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట కాంప్లెక్స్ మార్పుకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీ ఉన్నత పాఠశాల శంఖవరం కాంప్లెక్స్‌లో అన్ని వసతులు ఉన్నప్పటికీ మండల విద్యాశాఖాధికారులు ఏకపక్ష నిర్ణయంతో కలసపాడు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లో విలీనం చేయడం బాధాకరమని అన్నారు. భౌగోళిక విస్తీర్ణం దృష్ట్యా 5 ఎకరాలున్నా ఏకపక్ష తీర్మానం వలన ఈ కాంప్లెక్స్‌ను నిర్లక్ష్యం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శీలారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఖాశీంవలి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు బడ్జెట్‌లో అన్యాయం



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.రామయ్య, జిల్లా అధ్యక్షుడు వై.హరి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆటో కార్మికులతో కలిసి మంగళ వారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ జీఎస్టీ పరిధిలోకి తేవాలని, జీఓ 2131 రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన గెజిట్ నోటిఫికేషన్ 894ను రద్దు చేయాలన్నారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన పెన్షన్ సౌకర్యం కల్పించాలని, చంద్రన్న బీమా కింద రూ.10 లక్షల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మికులకు ఇచ్చిన హామీ అమలుచేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, నరసింహ, నాయబ్‌రసూల్, మీరావలి, బాషా, చిన్న గుర్రప్ప, మహబూబ్‌బాషా, మధు, షరీఫ్, సుధాకర్, మురళీ, ధనిరెడ్డి శివారెడ్డి పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తీసుకుంటే కంటికి ఆరోగ్యం

ప్రొద్దుటూరు: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే కంటిని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చునని డాక్టర్ మౌనిక తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక రామేశ్వరంలోని ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం 56 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారంతోపాటు సీజన్‌లో లభించే పండ్లు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే భోజనం, గుడ్లు, రాగి జావా, చిక్కీలు తినాలని తెలిపారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఈ హైస్కూల్‌లో సుమారు 10 శాతం మందికి దృష్టి లోపం ఉందని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, సీఓ శ్రీదేవి, విజయకుమారి, రాధ, ఆశా, లక్ష్మి పాల్గొన్నారు.

## పదోన్నతుల తర్వాతే ఆ పదం తొలగించండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సెక్రటరీలు

ప్రొద్దుటూరు: తమ పదోన్నతులు జరిగిన తర్వాతే డిజిగ్నేషన్‌లో పదాలు తొలగించాలని ఆంధ్ర ప్రదేశ్ వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం సచివాలయాల్లో తమను వార్డు ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీలుగా నియమించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ డిజిగ్నేషన్‌లో ఎడ్యుకేషన్ అన్న పదాన్ని తొలగించి ఇతర విధులకు బదిలీ చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. తమ పదోన్నతులపై నిర్దిష్ట విధానాన్ని అమలు చేసిన తర్వాతే ఎడ్యుకేషన్ పదాన్ని తొలగించాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలకు, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు సమర్పించడం జరుగుతోందన్నారు.

## పోరాటాలతోనే మహిళా హక్కుల సాధన



కరపత్రాలను విడుదల చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు క్రైం: మహిళల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని చైతన్య మహిళా సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఎన్జీఓహోంలో జరిగిన కార్యక్రమంలో ఈనెల 8న జరిగే కార్యక్రమాల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, కృష్ణవేణి, సావిత్రి, పద్మ, చంద్రావతి, మంగ, ఉషారాణి, సునీత, రెహనా హసీనా, మెహతాబ్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు న్యాయం చేయాలి

బద్వేలు అర్బన్: భాకరాపేట సమీపంలోని ప్రభుత్వ స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పేర్కొన్నారు. భాకరాపేట కాలనీలో ఇళ్ల పట్టాల కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలను తహసీల్దారు ఉదయ భాస్కర్‌రాజు నిమ్మరసం ఇచ్చి మంగళవారం విరమింపజేశారు. చంద్ర మాట్లాడుతూ పేదలు ఎక్కడైతే నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారో, అక్కడే అర్హులను గుర్తించి పట్టాలు పంపిణీ చేస్తామని తహసీల్దారు హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. వీరశేఖర్, వెంకటరమణ, ఇమ్మానియేల్, సుబ్బారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలు డివైడర్ వద్ద వేయవద్దు

పోరుమామిళ్ల: పట్టణ ప్రధాన రహదారిలోని దుకాణ యజమానులు ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్డుపై, రోడ్డు మధ్యలో డివైడర్ వద్ద వేయరాదని సర్పంచ్ సుధాకర్ హెచ్చరించారు. రోడ్డు డివైడర్‌లో ఉన్న చెత్తను, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లను పంచాయతీ సిబ్బందితో మంగళవారం తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు, దారిన పోయేవారు ప్లాస్టిక్ వ్యర్థాలకు డివైడర్‌లో వేసి చేతులు దులుపుకొంటున్నారని, సమస్యలు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు.

## మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



సర్టిఫికెట్ అందించి అభినందిస్తున్న డీఎస్పీ భావన



మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

ప్రొద్దుటూరు: మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ పి.భావన తెలిపారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వైద్యులు వరుణ్‌కుమార్ రెడ్డి, పద్మజ, జ్యోతి, నజ్మా బీజన్, సుజాత మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 118 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, విద్య, వైద్య, రక్షణ, వాణిజ్య రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలని కోరారు. డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలనిచెప్పారు. అనంతరం తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించిన ఇద్దరు చిన్నారుల హరిణి, ఎస్తేరు రాణిలకు సర్టిఫికెట్లు అందజేసి డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కో ఆర్డినేటర్ గౌరీశంకర్, మహి, లక్ష్మి, దేవిక, జ్యోతి, సుబ్బయ్య, ఎన్‌సీసీ ట్రైనీ దావీదు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరు**

చాపాడు: ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు అమ్మాయిలను బాధ్యతగా చదివిస్తే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని ట్రైనీ డీఎస్పీ భవానీ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో మంగళవారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ భవానీ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తులో స్త్రీ భాగస్వామ్యం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందన్నారు.అనంతరం వ్యాస రచన పోటీలలో విజేతలకు డీఎస్పీ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి, తదితరులు పాల్గొన్నారు.

**సాంకేతికత వినియోగంలో అప్రమత్తత అవసరం**

మైదుకూరు: మహిళలు, యువతులు సమకాలీన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికత వినియోగంపై జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. డిజిటల్, డ్రగ్ అవేర్‌నెస్, మహిళా సాధికారత, సోషల్ మీడియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనుకోకుండా ఏదైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలపై వివక్ష తగ్గుతోందని తెలిపారు. అనంతరం అర్బన్ సీఐ హాసం, ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలు చంద్రిక, నాగశృతి, మహేశ్వరిలను డీఎస్పీ రాజేంద్రప్రసాద్, అర్బన్ సీఐ హాసం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుబాన్‌సాహెబ్, అధ్యాపకులు అనురాధ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలం**

అట్లూరు: చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్ బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా మహోత్సవాన్ని పురస్కరించుకుని అట్లూరులో యోగాతోపాటు చిరుధాన్యాల స్టాల్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో పాటు చిరుధాన్యాల ఆహారంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్యాధికారి డాక్టర్ మాధురి, ఎంఈఓ విలియంరాజు, మురళీకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

**బాలికల శాతం పెంచేందుకు కృషి**

బద్వేలు అర్బన్: బాలికల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో ఆడపిల్లను చదివిద్దాం – ఆడపిల్లను రక్షిద్దాం నినాదంతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంఖ్య పెంచాలంటే తొలుత లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం (పీసీపీఎన్‌డీటీ)పై పూర్తిస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్ఓ చంద్రావతి, హెల్త్ సూపర్ వైజర్ వెంకటమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్ పాల్గొన్నారు.

**బి.కోడూరులో న్యూట్రిషన్ మేళా**

బి.కోడూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బి.కోడూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం న్యూట్రిషన్ మేళా, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, ఎంపీడీఓ భాస్కర్‌రావు మాట్లాడుతూ న్యూట్రిషన్ మేళా ఎగ్జిబిషన్‌లో చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, సుగుణ, సీతారామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### యోగాతోనే ఆరోగ్యం

రాజుపాళెం: ప్రతి ఒక్కరూ యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారని అర్కటవేముల జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం లక్ష్మణస్వామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అర్కటవేముల జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మిల్లెట్ యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ అందరూ ప్రతి రోజూ యోగా చేయడం మంచిదేనని చెప్పారు. సుబ్బరత్నమ్మ, లక్ష్మీదేవి, వసుంధర వరలక్ష్మి, రంజనీదేవి, పాల్గొన్నారు.

### ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని సాయి రాజేశ్వరీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చెన్నైకి చెందిన వీల్స్ ఇండియా లిమిటెడ్ అప్రెంటీస్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. ఈఈఈ ఫైనలియర్ విద్యార్థులు హర్షవర్ధన్, గంగామహేష్, శివ, భరత్, మాధవ్, మునిస్వామితోపాటు 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి విద్యార్థులను అభినందించారు.

### శంఖవరంలో ఉరుసు

కలసపాడు: మండలంలోని శంఖవరంలో హజరత్ హబీ సయ్యద్ ఖాజా రహతుల్లా నాయబే రసూల్ ఉరుసు నిర్వహిస్తున్నట్లు ముజావర్ ఓబయ్య తెలిపారు. 9న గంధం మహోత్సవం, 10న ఉరుసు, 11న తహలీల్ కార్యక్రమం ఉంటాయన్నారు. 9వ తేదీ రాత్రి హైదరాబాద్ వారిచే గొప్ప ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

### గాలికుంటు వ్యాధికి టీకాలు

పోరుమామిళ్ల: గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందని, వ్యాధి సోకిన పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ శారదమ్మ, కడప డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య పేర్కొన్నారు. గానుగపెంట పంచాయతీలో పశు వైద్యశిబిరం ఏర్పాటుచేసి మంగళవారం గాలికుంటువ్యాధి నివారణకు టీకాలు వేశారు. పోరుమామిళ్ల సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, పశువైద్యులు మహేశ్వరరెడ్డిపాల్గొన్నారు.

### మాల మహానాడు కమిటీ

పోరుమామిళ్ల: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నాలుగు మండలాల మాల మహానాడు కమిటీలను ఎన్నుకున్నారు. కడప జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు నాగ మల్లేశ్వరి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి. కోడూరు మండలాలకు కమిటీలను ఎన్నుకున్నారు. పోరుమామిళ్ల మండల అధ్యక్షుడిగా కిరణ్, బి.కోడూరుకు విజయరావు, కాశినాయనకు విజయ్, కలసపాడుకు రాజా అనులను ఎన్నుకున్నారు. సంపత్, రాబర్ట్, రాజు పాల్గొన్నారు.

### అవినీతికి పాల్పడితే చర్యలు

కలసపాడు: ఉపాధి హామీ పథకంలో సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 18వ విడత ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన 878 పనులకు రూ.7.27 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. కూలీలకు రూ.6.69 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.1.40 కోట్లు ఖర్చు చేశామన్నారు. కూలీలకు రూ.6.69 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.40 కోట్లు ఖర్చు చేశామన్నారు. 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించి రూ.96 వేలు అవినీతి జరిగిందని గుర్తించామన్నారు. అధికారులు రాంభూపాల్‌రెడ్డి, విజయభాస్కర్, ఆనంద్, మహబూబ్‌బీ పాల్గొన్నారు.

### విచారణ జరపాలి

ప్రొద్దుటూరు క్రైం: పట్టణంలోని వారాహి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన పసికందు ఘటనపై విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందినట్లు చెప్పారు. జిల్లా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.